క్లుప్తంగా

చందన అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి



చందన అలంకరణలో స్వామివారు

జామి: మండలంలో కుమరాం ఐశ్వర్య లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆషాడమాస ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం స్వాతీ నక్షత్రం, తొలి ఏకాదశి సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వర ప్రసాద్ సీతారామచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి సంపూర్ణ సుగంధ చందన ద్రవ్యాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. జూలై 3 వరకు ఉత్సవాలు కొనసాగుతాయని అర్చకులు తెలిపారు. ప్రతి రోజు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం ఉంటాయన్నారు. చివరిరోజు ఉదయం 8గంటలకు సుదర్శన హోమం, అనంతరం ఆలయంలో 11 సార్లు గిరి ప్రదక్షిణ ఉంటుంది.

నేడు రాజకీయ పార్టీ నేతలతో సమావేశం

జామి: ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ తెలిపారు. మండలంలోని అన్ని రాజకీయ పార్టీల మండల అధ్యక్షుడు, పార్టీ ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

సేంద్రియ పంటల పరిశీలన

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి క్లస్టర్‌లో సేంద్రియ విధానంలో సాగుచేస్తున్న పంటలను ఐసీఎస్ అధికారులు గురువారం పరిశీలించారు. బొద్దా సుస్థిర వ్యవసాయం కేంద్రం కోఆర్డినేటర్ వెంకటరావు నేతృత్వంలో పాతవూరు, ఎస్.కె.ఎస్.పురం గ్రామాల్లో ఇంటర్నల్ కంట్రోల్ సిస్టం(ఐసీఎస్) ఆర్గానిక్ సర్టిఫికెట్ యాన్యువల్ ఇన్‌స్పెక్షన్ నిమిత్తం లాకన్ బృందం సభ్యుడు శరద్ యాదవ్ క్షేత్ర పరిశీలన చేశారు. రైతులతో మాట్లాడి పంట దిగుబడులపై ఆరా తీశారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

కొత్తవలస: మండలంలోని అప్పన్నదొరపాలెం సమీపంలో దార పైడితల్లిమ్మ గుడి వద్ద నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్సై సీహెచ్. హేమంత్ ఆధ్వర్యంలో పోలీస్‌లు గురువారం దాడి చేశారు. పేకాట అడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.1,13,920 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట: మేజర్ పంచాయతీ ఎస్.కోట పట్టణంలో వన్ వే జంక్షన్ నుంచి పంచాయతీ కార్యాలయం వరకు జిల్లాపరిషత్ నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు, డ్రైన్‌ల నిర్మాణానికి ఎమ్మెల్సీ రఘురాజు గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వర రావు, వైస్ ఎంపీపీ సుధారాజు, సర్పంచ్ సంతోషికుమారి, ఉపసర్పంచ్ మోపాడ కుమార్, ఎంపీటీసీలు దేవి, ఆదిలక్ష్మి, దారగిరి, సన్యాసప్పడు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు



దత్తిరాజేరు: దత్తి వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మెరకముడిదాం: మండలంలోని భైరపురం గ్రామంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం భక్తిశ్రద్ధలతో తొలిఏకాదశి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సముద్రాల శ్రీధర్ ఆచార్యులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు వేకువజాము నుంచే స్వామిని దర్శించుకునేందుకు ఆలయం వద్ద బారులుతీరారు.
దత్తిరాజేరు: దత్తి గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆషాడమాసం తొలి శుద్ధ ఏకాదశి సందర్భంగా గురువారం తెల్లవారుజామునుంచి స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.

మద్యం సీసాలు స్వాధీనం

గజపతినగరం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై గంగరాజు తెలిపారు. మండలంలోని కొనిశ గ్రామంలో తుపాకుల అప్పన్న అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. అతని వద్ద 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోద చేసినట్లు చెప్పారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన

- ఎమ్మెల్యే బొత్సఅప్పలనరసయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు



కొత్తగా మంజూరైన రైస్‌కార్డును లబ్ధిదారుడు రామారావుకు అందజేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గంట్యాడ: ప్రజా సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు కోరారు. మండలంలోని పెదవేమలి గ్రామంలో గురువారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. నాలుగేళ్లలో ఒక్కో కుటుంబానికి జరిగిన లబ్ధిని వివరించే బుక్‌లెట్లు అందజేశారు. ఈ సందర్భంగా స్థానికులు సీసీరోడ్డు, విద్యుత్ స్తంభాలు వేయాలని ఎమ్మెల్యేను కోరగా.. అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ జేఈ కృష్ణమూర్తి, విద్యుత్ ఏఈ ప్రసన్నకుమార్‌లను ఆదేశించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో పేదలకు ఉచిత వైద్య సేవలతో పాటు చికిత్స అనంతరం రోగి కోలుకునేవరకు జీవన భృతిని అందజేస్తున్నట్లు చెప్పారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యా స్థాపనకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి బాటలు వేశారని అన్నారు. గడపగడపకు వెళ్లినపుడు ప్రజలు ప్రభుత్వ పనితీరుపై సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వస్తున్న ప్రజాధరణ చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపీపీ పీరుబండి హైమావతి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, ఎంపీటీసీ పాటుపురెడ్డి భవాని, సర్పంచ్ వర్రి పాపునాయుడు, పార్టీ సీనియర్ నాయకులు రంభ సత్యారావు, లచ్చిరెడ్డి కృష్ణ, పి.నారాయణమూర్తి, కిలపర్తి అప్పలనాయుడు, రామసూర్యం, కోడెల ముత్యాలనాయుడు, పలువురు అధికారులు, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నేడు డీకేపర్తిలో..

మండలంలోని డీకేపర్తి గ్రామంలో శుక్రవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ పీరుబండి హైమావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు అందరు పాల్గొనాలని కోరారు.

● త్యాగానికి ప్రతీక బక్రీద్



లక్కవరపుకోట: మండల కేంద్రంలోని మసీద్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్‌ను ముస్లింలంతా కలిసి గురువారం ఘనంగా జరుపుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. బక్రీద్ విశిష్టతను మత పెద్దలు వివరించారు. ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని కలిగి ఉండాలని, తోటి వారికి నిస్వార్థంతో సాయం చేస్తే అల్లా అనుగ్రహం లభిస్తుందన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



జామి: జామిలో ముస్లిం సోదరుల ప్రార్థనలు



గజపతినగరం: బక్రీద్ శుభాకాంక్షలు చెప్పుకుంటున్న ముస్లిం సోదరులు



చీపురుపల్లి రూరల్: మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

'జగనన్న సురక్ష'పై అవగాహన



వేపాడ: బొద్దాం సచివాలయంలో సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అధికారులు

వేపాడ: జగనన్న సురక్ష కార్యక్రమంలో నిర్వహించాల్సిన బాధ్యతలపై ఎంపీడీఓ బీఎస్ఎన్‌కే పట్నాయక్, తహసీల్దార్ ప్రసన్న కుమార్ వలంటీర్లుకు అవగాహన కల్పించారు. బొద్దాలలో సచివాలయంలో గురువారం వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రజా సమస్యలు తెలుసుకుని యాప్‌లో నమోదు చేయడం, అర్జీల స్వీకరణ, సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు.
జామి: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా జూలై ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్న గ్రామ సభల నిర్వహణ, సర్వేలపై వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గృహసారథులకు అవగాహన కల్పిస్తున్నారు. మండలంలోని జె.డి.వలస, కలగాడ గ్రామాల్లో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఓ నవీన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు గుడివాడ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి, కె.కృష్ణాపురం సచివాలయాల్లో ఈ నెల 1న జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి క్యాంపులు నిర్వహిస్తారన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రూ.5.5 లక్షలతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు



ఆర్వో ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు

లక్కవరపుకోట: మండంలోని మల్లివీడు గ్రామంలో మండల పరిషత్ నిధులు, శ్రీసత్యసాయి ట్రస్ట్ ఫర్ యూనివర్స్ వెల్ఫేర్ సంయుక్తంగా చేపట్టే వాటర్ ప్యూరిఫైయింగ్ ప్లాంట్(ఆర్వో ప్లాంట్) నిర్మాణానికి ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు గురువారం శంకుస్థాపన చేశారు. జలామృతం కార్యక్రమంలో భాగంగా సత్యసాయి ట్రస్ట్ వారు ప్లాంట్ నిర్మాణానికి రూ.2.5 లక్షలు అందజేశారు. అలాగే మండల పరిషత్ నిధులు రూ.3 లక్షలు కేటాయించినట్లు ఎంపీపీ తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధజలం అందించాలనే లక్ష్యంతో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదిరెడ్డి అర్జున, గ్రామ పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కొత్తవలసలో పీఎన్‌బీ బ్రాంచ్ ప్రారంభం



నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న దీపక్ కుమార్ శ్రీవత్సవ్

కొత్తవలస:

కొత్తవలస–విజయనగరం రహదారిలో తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ బ్రాంచ్‌ను బ్యాంక్ జోనల్ మేనేజర్ దీపక్ కుమార్ శ్రీవత్సవ్ ప్రారంభించారు. ఇది విశాఖ సర్కిల్ పరిధిలో 66వ బ్రాంచ్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకు కృషిచేస్తామన్నారు. ఈ బ్రాంచ్‌లో గోల్డ్, హోం, వెహికల్, ఇతర అన్ని రకాల రుణాలను తక్కువ వడ్డీపై అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విశాఖపట్నం బ్యాంక్ సర్కిల్ హెడ్ డీజీఎం వి.నీలిమ, బ్రాంచ్ మేనేజర్ ఎస్.చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమం..



మహిళకు సంక్షేమ లబ్ధిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: చరిత్రలో ఏ ముఖ్యమంత్రి అందించని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని, ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే శ్రీనివాసరావు అన్నారు. ఎస్.కోట పట్టణంలో సచివాలయం–3 పరిధిలో పార్టీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ రహ్మాన్ నేతృత్వంలో గురువారం నిర్వహించిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే ప్రయత్నం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఇంకా ఎవరైనా అర్హులు పథకాలు పొందనట్లయితే వారిని గుర్తించి పథకాలు అందించేందుకు 'జగనన్న సురక్ష' కార్యక్రమానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారన్నారు. జూన్ 1వ తేదీ నుంచి గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించి ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు అందించడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలేస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి ఏ కష్టం రాకుండా చూసుకుంటున్నారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డికి అధికారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వేపాడ ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, మండల ఉపాధ్యక్షుడు పినిశెట్టి వెంకటరమణ, మెరపుల సత్యనారాయణ, గొర్లె రవికుమార్, వాకాడ రాంబాబు, ఎస్.చంద్రరావు, వాకాడ సతీష్, డి.పార్వతి, కొటాన ఈశ్వరి, మోపాడ కోటి, మజ్జి శేఖర్, షేక్ అమానుల్లాఖాన్, గనివాడ శ్రీను, నిరుజోగి శ్రీనివాస్, గణేష్, ఈశ్వరరావు, కె.అప్పయ్య, కె.జయశంకర్, ఎం.బుజ్జి, నాగరాజు, రమేష్, ఎన్.నాగరాజు, వై.అప్పలసత్యం, అవతారం, పైడితల్లి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజావేదిక

గజపతినగరం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం 17వ విడత సామాజిక తనిఖీల ప్రజావేదికను ఈనెల 30న ఉదయం 10గంటలకు పాతమండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.కిశోర్‌కుమార్ తెలిపారు. మండలంలో 30 గ్రామ పంచాయతీలకు సంబంధించి 01.04.2022 నుంచి 31.03.2023 వరకు చేపట్టిన ఉపాధి పనులు, పంచాయతీరాజ్ పనులు, ఎస్ఎస్ఏ పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఆ నివేదికలను ప్రజావేదికలో వెల్లడించనున్నట్లు చెప్పారు.

జేవీకే కిట్ల పంపిణీపై ఆరా..

గజపతినగరం: జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీపై స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు రాజేంద్ర ప్రసాద్, సంతు, శ్రీనివాసరావు ఆరా తీశారు. గురువారం గజపతినగరం, పురిటిపెంట గ్రామాల్లో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి జేవీకే కిట్లు అందాయా లేదా అని విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారితో జేవీకే అథెంటికేషన్ తీసుకున్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ రెడ్డి, ఎండీఎం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి సిబ్బంది పనితీరుపై అసంతృప్తి

గజపతినగరం: వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చి ఓపీ రాయమంటే ప్రాంతీయ ఆస్పత్రి సిబ్బంది రాయకుండా బయటకు పంపించేశారని సాలిపేట సర్పంచ్ గంట్యాడ పైడపునాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రి సిబ్బంది తీరుకు నిరసనగా ఆస్పత్రి ముందు విద్యార్థులతో కలిసి గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జ్యోతి రావుపూలె స్కూల్లో చేర్పించేదుకు వై.యశ్వంత్, ఎం.నాగచాద్విక్‌కు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం ఉదయం 11 గంటల 45 నిమిషాలకు ప్రాంతీయ ఆస్పత్రికి వచ్చామని, ఓపీ రాయమని సిబ్బందిని అడిగితే సమయం అయిపోయిందని చెప్పి పొమ్మన్నారన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని ఆస్పత్రి సిబ్బంది వద్ద ప్రస్తావించగా..సెలవు దినం కావడంతో 12 గంటల వరకే ఓపీ ఉంటుందని చెప్పారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ



దివ్యాంగులకు వస్త్రాలు అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ జగదీష్‌బాబు

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం సమీపంలో ఉన్న శ్రీగురుదేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ ఆర్థిక సహాయకులు కొసరాజు వెంకటపూర్ణచంద్రరావు జ్ఞాపకార్థం గురువారం పలువురు దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు మాట్లాడుతూ 5 మంది దివ్యాంగులకు కృత్రిమ అయవాలు, వస్త్రాలు అందజేసినట్లు తెలిపారు. అనంతరం దివ్యాంగులకు అన్నసమారాధన నిర్వహించారు.

ట్రాఫిక్ కంట్రోల్ బూత్ ఏర్పాటు

కొత్తవలస: కొత్తవలస మూడు రోడ్ల జంక్షన్ వద్ద ట్రాఫిక్ కంట్రోల్ బూత్‌ను సీఐ ఎస్.బాలసూర్యారావు గురువారం ప్రారంభించారు. విశాఖపట్నంకు చెందిన సీఎంఆర్ సంస్థ వారి ఆర్థిక సహాయంతో ఈ బూత్‌ను ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం కిసాన్‌కు ఈకేవైసీ తప్పనిసరి

బొండపల్లి: పీఎం కిసాన్ యోజన కోసం అర్హులైన ప్రతీ రైతు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి పి.వి.మల్లికార్జున రావు సూచించారు. ఈకేవైసీ పూర్తికాని రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ డబ్బులు జమకావని తెలిపారు. రైతులు ఈనెల 30వ తేదీ సాయంత్రంలోగా గ్రామ వలంటీర్లు, ఆర్బీకే సిబ్బందిని సంప్రదించి ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

గజపతినగరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, నివాస గృహాలు, వసతి గృహాలు, బ్యాంకులు, ప్రభుత్వ పాఠశాలల్లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు అగ్నిమాపకశాఖ అధికారి ఎంఎస్‌వీ రవిప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. వారానికి ఒక సారి ఈ అవగాహన సదస్సులు, మాక్‌డ్రిల్ నిర్వహణ ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషిచేస్తామన్నారు.

లైవ్‌ఫిష్ యూనిట్ల మంజూరు



లబ్ధిదారులకు లైవ్‌ఫిష్ యూనిట్ తాళాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, నెక్కలి నాయుడుబాబు

కొత్తవలస: ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో మత్స్యసంపద వృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని ఆర్ధన్నపాలెం సమీపంలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబుతో కలిసి రెండు లైవ్‌ఫిష్ యూనిట్లను గురువారం లబ్ధిదారులకు అందజేశారు. కొత్తవలస మండలం గులివిందాడ గ్రామానికి చెందిన చింతల అప్పారావు, లక్కవరపుకోట మండలం నిడుగట్టు గ్రామానికి చెందిన దుక్క అప్పలరాజుకు లైవ్‌ఫిష్ యూనిట్లు మంజూరు కావడంతో లబ్ధిదారులకు వాటిని అందజేశారు. వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అనంతరం మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. ఒక్కో యూనిట్‌లో స్వరాజ్ మజ్దా వ్యాన్, నాలుగు లైవ్‌ఫిష్ ట్యాంక్‌లు, నాలుగు ఆక్సిజన్ సిలిండర్లు ఉంటాయన్నారు. వాటి విలువ రూ.20 లక్షలు ఉంటుందన్నారు. ఎస్సీలకు రూ.12 లక్షలు రాయితీ, బీసీలకు రూ.8 లక్షలు రాయితీపై అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎల్.కోట ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, వేపాడ మండల పార్టీ అధ్యక్షుడు ముమ్మలూరి జగన్నాథం, కొత్తవలస జేసీఎస్ ఇన్‌చార్జ్ బొంతల వెంకటరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.చంద్రరావు, తూర్పాటి శివాజీ, జి.గణేష్, పల్లా భీష్మ, వెలగల వెంకటరమణ, రాములమ్మ, పెదిరెడ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకలవ్య జయంతి



ఏకలవ్య విగ్రహం వద్ద సంబరాలు చేసుకుంటున్న ఎరుకల కులస్తులు

శృంగవరపుకోట: మండలంలోని పోతనాపల్లి గ్రామంలో ఏకలవ్య జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో నివాసం ఉంటున్న ఎరుకులతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ఏపీ ఎరుకుల సేవాసంఘం నాయకులు, కార్యకర్తలు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి గేదెల సత్తిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గేదెల లక్ష్మణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న ఎరుకుల జాతి ప్రజలంతా ఏకాదశి నాడు ఏకలవ్య జయంతి జరుపుకోవటం ఆనవాయితీ అన్నారు. జాతి అంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర మహిళా కార్యదర్శి డి.సత్యవతి, విజయనగరం జిల్లా ఏపీవైఐఎస్ మహిళాధ్యక్షురాలు గొర్లి సత్యవతి, జిల్లా కార్యదర్శి గొర్లి రమణ, పోతనాపల్లి మాజీ సర్పంచ్ గేదెల పోతయ్య, ధర్మవరం మాజీ సర్పంచ్ గొర్లె దేముడు తదితరులు పాల్గొన్నారు.

జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌లు వీరే..



కేఎస్ఆర్‌కే ప్రసాద్, మెరకముడిదాం



బెల్లాన బంగారు నాయుడు, గుర్ల



సువ్వాడ అప్పలనాయుడు, చీపురుపల్లి



పొన్నాడ కుమార్, గరివిడి



పల్లి రఘు, బొండపల్లి



కనకల సుబ్రహ్మణ్యం, గజపతినగరం



మహదేవ ఫణీంద్రుడు, దత్తిరాజేరు



సీహెచ్.రామసూర్యం, గంట్యాడ



బొంతల వెంకటరావు, కొత్తవలస



సూరెడ్డి చంద్రు నాయుడు, జామి



యడ్ల కిశోర్, లక్కవరపుకోట



బోజంకి శ్రీనివాసరావు, వేపాడ

జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు విడుదల చేసింది. వీరంతా ఆయా మండలాల పరిధిలో ఉన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా కృషిచేయాల్సి ఉంటుంది. ఎంపికైన వారికి పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



వాకాడ సతీష్, శృంగవరపుకోట